క్లుప్తంగా

బంగారు తాపడం పనులకు రూ.లక్ష విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ ఆలయ బంగారు తాపడం పనులకు హైదరాబాద్‌కు చెందిన భక్తులు శుక్రవారం రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. హైదరాబాద్ ఎల్బీ నగర్‌కు చెందిన మెరుగు గోపాల్ కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. ఆలయ అధికారులను కలిసిన దాతలు రూ.లక్ష విరాళాన్ని బంగారు తాపడం పనులకు అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం ఈఈ కోటేశ్వరరావు దాతలకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

ప్రసాదాల పంపిణీపై హర్షం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రి గిరిప్రదక్షిణలో దేవస్థానం భక్తులకు ఉచిత ప్రసాదాలను పంపిణీ చేయడంతో శ్రీ శబరిమల అయ్యప్ప సేవా సమాజం ఏపీ కోశాధికారి అవ్వారు బుల్లబ్బాయ్ ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. కొంత కాలంగా గిరి ప్రదక్షిణ సమయంలో దేవస్థానం ప్రసాదాల పంపిణీని నిలిపివేసింది. దీంతో అయ్యప్ప సేవా సమాజం ప్రతినిధులు ఆలయ ఈఓకు పత్రికా రూపంలో తెలియజేయడం, దేవస్థానం వెంటనే స్పందించి ప్రసాదాలను అందించినట్లు బుల్లబ్బాయ్ పేర్కొన్నారు. సేవా సమాజం అధ్యక్షుడు ఎస్.వాసు, సెక్రటరీ వెంకయ్య, రామకృష్ణ, మారుతీలు దేవస్థాన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

కమనీయం శ్రీ లక్ష్మీనారాయణ స్వామి కల్యాణం



పూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ): నగరంలోని పెజ్జోనిపేట(హర్షుపేట)లో కొలుదీరిన శ్రీ లక్ష్మీనారాయణస్వామి దేవస్థానంలో శుక్రవారం స్వామివార్ల కల్యాణం కన్నుల పండువగా జరిగింది. ముందుగా గోపూజ, విఘ్నేశ్వర పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని పెండ్లి కుమారుడిగా అలంకరించారు. అనంతరం కల్యాణమహోత్సం నిర్వహించారు. 50మంది దంపతులు కళ్యాణంలో పాల్గొన్నారు. భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. సాయంత్రం స్వామివార్ల నగరోత్సంను నిర్వహించారు. శ్రీ లక్ష్మీనారాయణ భజన మండలి వారిచే నిర్వహించిన కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు జె.ఎస్.ఆర్.కృష్ణప్రసాద్, టి.శ్రీనివాసచక్రవర్తి, జయలక్ష్మి పర్యవేక్షించారు.

మతి స్థిమితం లేని వివాహిత అదృశ్యం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మతి స్థిమితం లేని వివాహిత అదృశ్యమైన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. ఘటనపై ఆమె భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. శ్రీకాకుళం జిల్లా సారవకోట బద్రి గ్రామానికి చెందిన బలగ రమణయ్య, పద్మలు భార్యాభర్తలు. జీవనోపాధి నిమిత్తం నగరానికి వలస వచ్చి కొత్తపేట ఆంజనేయవాగు సెంటర్‌లో అద్దె ఇంట్లో ఉంటున్నారు. 12వ తేదీ మధ్యాహ్నం ఇంట్లో భార్యాభర్తలిద్దరూ నిద్రపోయారు. రెండు గంటల సమయంలో రమణయ్యకు మెలుకువ వచ్చి చూడగా పద్మ కనిపించలేదు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

మధురంగా సాగిన సంగీత కచేరీ



విజయవాడ కల్చరల్: స్వరఝరి సంగీత సాహిత్య సేవాసంస్థ నెలవారీ కార్యక్రమంలో భాగంగా గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదిక మీద శుక్రవారం నిర్వహించిన కర్నాటక గాత్ర సంగీత సభ సుమధురంగా సాగింది. గాయని లలితాచంద్రశేఖర్ శ్రీరాగం వర్ణంతో ప్రారంభించి ముత్తుస్వామి దీక్షితార్ కీర్తన గణపతే, హిరణ్మయీం లలితాం, ఓగిరాల వీరరాఘవశర్మ రచించిన నేడే ననుసేవింప, త్యాగరాజ స్వామి కీర్తన బ్రోచేవారెవరే, అన్నమాచార్య సంకీర్తన ధర్మవతి, జయదేవుని అష్టపది అనిల తరళ, రామదాసు కీర్తన రామభద్ర కీర్తనలను మధురంగా ఆలపించారు. వయోలిన్‌పై బీవీ దుర్గాభవానీ, మృదంగంపై మంగళగిరి శ్రీధర్ వాద్య సహకారం అందించారు. స్వరఝరి సంస్థ అధ్యక్షులు తాడిమేటి సీతారామచంద్రమూర్తి సంతాప సభను కూడా ఇదే వేదికమీద నిర్వహించారు. సంస్థ కార్యదర్శి మోదుమూడి సుధాకర్ రామచంద్రరావు సంస్థకు చేసిన సేవలను వివరించారు.

వైభవంగా ఇంద్రకీలాద్రి గిరిప్రదక్షిణ



పూలరథంపై కొలువై ఉన్న శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్లు



గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తజనం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్లు కొలువై ఉన్న ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ శుక్రవారం అంగరంగ వైభవంగా సాగింది. ఫాల్గుణ పౌర్ణమిని పురస్కరించుకుని దేవస్థాన ఘాట్‌రోడ్డులోని కామధేను అమ్మవారి ఆలయం నుంచి ప్రారంభమైన గిరి ప్రదక్షిణ ఇంద్రకీలాద్రి కొండ చుట్టూ 8 కిలో మీటర్ల మేర సాగింది. శుక్రవారం తెల్లవారుజామున 5.55 గంటలకు ఘాట్‌రోడ్డులోని కామధేను అమ్మవారి ఆలయం వద్ద ప్రత్యేకంగా పూలతో అలంకరించిన వాహనంపై శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వార్లు కొలువు తీరగా, ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆదిదంపతులు కొలువై ఉన్న వాహనంతో పాటు దేవస్థాన ప్రచార రథానికి ఆలయ డీఈఓ రత్నరాజు, స్థానాచార్య విష్ణుభట్ల శివప్రసాద్ శర్మ, వైదిక కమిటీ సభ్యులు రంగావఝల శ్రీనివాసశాస్త్రి ఊరేగింపును ప్రారంభించారు.

కనుల పండువగా ఊరేగింపు

కామధేను అమ్మవారి ఆలయం నుంచి కుమ్మరిపాలెం, విద్యాధరపురం నాలుగు స్తంభాలు, సితారా జంక్షన్, కబేళా, పాలప్రాజెక్టు, కేఎల్‌రావునగర్, చిట్టినగర్, కేటీరోడ్డు మీదగా, కొత్తపేట నెహ్రూబొమ్మ సెంటర్, బ్రహ్మణ వీధి మీదగా స్వామివార్ల ఊరేగింపు ఆలయ ప్రాంగణానికి చేరుకుంది. మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ అశేష భక్తజనం మధ్య ఊరేగింపు కన్నుల పండువగా సాగింది. పౌర్ణమి, హోలీ పర్వదినాన్ని పురస్కరించుకుని పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారి ఊరేగింపులో ముందుకు సాగారు. సాధారణంగా ప్రతి పౌర్ణమికి ఉదయం 6 గంటలకు ప్రారంభమయ్యే ఊరేగింపు 9.30 గంటలకు పూర్తవుతుంది. అయితే శుక్రవారం ఉదయం 6 గంటలకు ప్రారంభమైన ఊరేగింపు ఆలయానికి చేరుకునే సరికి 11 గంటలైంది. ఊరేగింపు అనంతరం ఘాట్‌రోడ్డు వద్ద ఆది దంపతులకు పూజ నిర్వహించడంతో ఉత్సవం పరిసమాప్తమైంది.

హోలీ..జాలీ..జాలీ



బెరంపార్క్ లాన్‌లో హోలీ వేడుకల వేదిక వద్ద యువత సందడి



కేరింతలు కొడుతూ డ్యాన్స్ చేస్తున్న దృశ్యం



హోలీ వేడుకలో ఫొటోలు దిగుతున్న యువతులు



హోలీ వేడుకల్లో భాగంగా ఫోమ్‌లో ఆడుకుంటున్న చిన్నారులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): హోలీ వేడుకల్లో యువత జాలీ జాలీగా ఎంజాయ్ చేశారు. భవానీపురంలో ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థకు చెందిన బెరంపార్క్‌లో శుక్రవారం సాయంత్రం పెద్ద ఎత్తున జరిగిన హోలీ వేడుకల్లో చిన్నా పెద్దా తేడా లేకుండా ఒక వైపు రంగులు చల్లుకుంటుంటే మరో వైపు వేదిక నుంచి వచ్చే మ్యూజిక్‌కు అనుగుణంగా యువతీ యువకులు ఉత్సాహంగా డ్యాన్స్‌లు చేశారు. క్రియేటివ్ స్విమ్మింగ్ పూల్‌లో టమాటాలతో కొట్టుకుంటూ ఎంజాయ్ చేశారు. ఒంటి నిండా రంగులతో ఉన్న యువతులు ఉత్సాహంగా ఫొటోలు దిగారు. హోలీ రంగులలో మునిగితేలిన యువత శుభ్రం చేసుకునేందుకు పున్నమిఘాట్‌లో జల్లు స్నానం ఏర్పాటు చేశారు. ఘాట్‌లోనే తినుబండారాలు, శీతల పానీయాల విక్రయాలు జరిగాయి. ఇక్కడ ప్రత్యేకంగా అవుట్ డోర్ స్టుడియో ఏర్పాటు చేయగా యువత వచ్చి రకరకాల ఫోజుల్లో ఫొటోలు దిగారు. మొత్తం మీద రంగు రంగుల హోలీ వేడుకలో యువతలో ఉత్సాహం ఉరకలేసింది.

సందడిగా హోలీ వేడుకలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్‌లో హోలీ వేడుకలను శుక్రవారం స్థానిక ప్రజానీకం ఘనంగా నిర్వహించారు. ప్రధానంగా వన్‌టౌన్‌లోని కేటీ రోడ్డు, బ్రాహ్మణవీధి, సింగరాజువారివీధి, సుబ్బరామయ్యవీధి తదితర ప్రాంతాల్లో యువత ఉత్సాహంగా హోలీ సంబరాలను జరుపుకున్నారు. చిన్నారులు, యువకులు రోడ్లపై తిరుగుతూ తమ స్నేహితులపై రంగులు చల్లుతూ హడావుడి చేశారు. ప్రధానంగా ఉత్తరభారతీయ కుటుంబాలే కాకుండా తెలుగువారు సైతం అత్యధికంగా ఈ వేడుకల్లో పాల్గొని ఉల్లాసంగా గడిపారు. కొత్తపేటలోని లతటవర్స్‌లో ప్రత్యేకంగా వాద్యాలతో సందడి చేస్తూ అపార్ట్‌మెంట్ వాసులందరూ హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. వెలగలేటివారివీధిలోని అపార్ట్‌మెంట్స్‌లోనూ అదే తరహా సందడి కొనసాగింది. చిన్నాపెద్దా తేడా లేకుండా రంగులు పూసుకుంటూ శుభాకాంక్షలు ఇచ్చిపుచ్చుకున్నారు. చిన్నారులు, యువకులు బృందాలుగా తిరుగుతూ రంగులు పూసుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. దాంతో పాతబస్తీలోని అత్యధిక రహదారులు హోలీ రంగులతో దర్శనమిచ్చాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ వివిధ ప్రాంతాల్లో సందడి చేసిన ప్రజానీకం అక్కడి నుంచి కృష్ణానదికి వెళ్లి స్నానాలు చేశారు.

విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి కృషి : కలెక్టర్



విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాలను అందజేస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, ఎంపీ కేశినేని

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు) : విభిన్న ప్రతిభాంతులు కన్న కలలను సాకారం చేసుకోడానికి అవసరమైన పూర్తి సహాయ సహకారాలను అందజేయడంలో తాను ఎల్లప్పుడూ ముందుంటానని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ కృత్రిమ అవయవాల తయారీ సంస్థ(అలింకో) సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం మొగల్రాజపురంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో విభిన్న ప్రతిభావంతులకు వీల్‌చైర్స్, ట్రైసైకిల్స్, కృత్రిమ అవయవాలను పంపిణీ చేశారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, జిల్లా కలెక్టర్ లక్ష్మీశ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు ఎంతో ఉపయోగకరంగా ఉండే కృత్రిమ అవయవాలు, ట్రైసైకిళ్లు, వీల్ చైర్స్ పంపిణీ చేయడం ఆనందంగా ఉందన్నారు. విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ కార్యక్రమాలను జిల్లాలో సమర్థవంతంగా అమలు చేస్తానని తెలిపారు. ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ ప్రతి మూడునెలలకు ఒకసారి కృత్రిమ అవయవాలు, ట్రైసైకిళ్లు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చెప్పారు. విజయవాడ సెంట్రల్, తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలోని 750 మంది విభిన్నప్రతిభావంతులకు వివిధ రకాల ఉపకరణాలను పంపిణీ చేస్తున్నామని చెప్పారు. తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, అలింకో సంస్థ ప్రతినిధి రవిశంకర్, నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన విభిన్న ప్రతిభావంతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): చిట్టినగర్ సెక్షన్ మిల్క్ ప్రాజక్ట్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోగల 11 కేవీ రాజీవ్ శర్మ నగర్ ఫీడర్ విద్యుత్ లైన్ల మరమ్మతులు, మెయింటెనెన్స్ నిమిత్తం రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ (విజయవాడ టౌన్) రవీంద్రబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం ఎనిమిది నుంచి 10 గంటల వరకు రాజీవ్ శర్మ నగర్, దీన్ దయాల్ నగర్, సౌమ్య థియేటర్ వెనుక వైపు, కోస్టల్ స్కూల్, స్విమ్మింగ్ పూల్ ఏరియా, ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రం, మురళీకృష్ణ బిళ్లల కంపెనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు పేర్కొన్నారు.

17న ఉచిత కంటి వైద్య శిబిరం

భవానీపురం(విజయవాడపశ్చిమ): పశ్చిమ నియోజకవర్గంలోని అయాన్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఈ నెల 17న భవానీపురం స్వాతీ సెంటర్ మసీదు రోడ్‌లోని రజా మసీదు ప్రాంగణంలోని వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ ఎండీ ఇర్ఫాన్ ఆఫీస్ వద్ద ఉచిత నేత్ర వైద్య సేవా శిబిరం నిర్వహించనున్నట్లు ఆ హాస్పిటల్ ఫౌండేషన్ గౌరవాధ్యక్షుడు వీ రజనీకాంత శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరిగే ఈ శిబిరంలో హాస్పిటల్ చీఫ్ వైద్యులు బషీర్ అహ్మద్ తన వైద్య సిబ్బందితో అధునాతన వైద్య యంత్ర పరికరాలతో కంటి పరీక్షలు చేస్తారని తెలిపారు. మందులు, ఐ డ్రాప్స్ ఉచితంగా అందజేస్తారని పేర్కొన్నారు. భవానీపురం నివాసితులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన



పటమట(విజయవాడతూర్పు): శాస్త్ర, సాంకేతికరంగాల్లో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులు వారి నైపుణ్యాలను కూడా మెరుగుపరచుకోవాలని పటమట ఎన్ఆర్ఐ ఇండియన్ స్ప్రింగ్స్ స్కూల్ డైరెక్టర్ కొమ్మారెడ్డి చైతన్య సూచించారు. పటమట పోస్టల్ కాలనీలోని స్కూల్లో సైన్స్ స్పార్క్ ఎస్2 కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్స్‌రంగంలో నిత్యం నూతన ఆవిష్కరణలు వస్తుంటాయని, వాటిని అవగతం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు రూపొందించిన ఆయా ప్రాజెక్టులు అందరినీ ఆకట్టుకున్నాయి. న్యాయనిర్ణేతగా ఎన్ఆర్ఐ అకాడమీ బోటనీలెక్చరర్ కె. సురేష్ రాజు వ్యవహరించారు. పాఠశాల ప్రిన్సిపాల్ జి.తుషార, అకాడమిక్ కోఆర్డినేటర్ లక్ష్మణరావు, హరిణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బెరంపార్క్‌ను సుందరీకరించండి

ఏపీటీడీసీ చైర్మన్ నూకసాని బాలాజీ



అధికారులతో మాట్లాడుతున్న చైర్మన్ బాలాజీ

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆంధ్రప్రదేశ్ శాసనసభా సమావేశాల ముగింపును పురస్కరించుకుని ఈ నెల 21న శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులకు ఆటవిడుపుగా నిర్వహించనున్న సాంస్కృతిక ప్రదర్శనలకు విజయవాడ భవానీపురంలోని ఏపీ పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ)కు చెందిన బెరంపార్క్ వేదిక కానుంది. ఆట.. పాట.. నృత్యాలతోకూడిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఏపీటీడీసీ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ శుక్రవారం అధికారులతో కలిసి బెరంపార్క్‌ను పరిశీలించారు. వ్యర్థాలను తొలగించి పరిసరాలన్నీ పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. జేసీబీతో శుభ్రం చేస్తున్న పనులను పరిశీలించారు. వరదకు కూలిపోయిన వృక్షాల మొద్దళ్లను తరలించి శుభ్రంగా ఉంచాలని చెప్పారు. పున్నమిఘాట్‌లోని స్నాక్స్ స్టాల్, వాటర్ ఫౌంటెన్‌ను పరిశీలించి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు.

సీసీ కెమెరాలు పూర్తి స్థాయిలో పని చేయాలి

బెరంపార్క్‌లో సీసీ కెమెరాలన్నీ పూర్తి స్థాయిలో పని చేసేలా చర్యలు తీసుకోవాలని బాలాజీ పేర్కొన్నారు. బోటింగ్ పాయింట్ వద్ద నదిలో పేరుకుపోయిన నాచును తొలగించాలని చెప్పారు. బెరంపార్క్ పార్కింగ్ ప్రదేశంలో అభివృద్ధికి అడ్డంకిగా ఉన్న హైటెన్షన్ విద్యుత్ టవర్‌ను మరో ప్రదేశానికి తరలించే విషయమై విద్యుత్ శాఖ మంత్రితో మాట్లాడారు. కార్యక్రమంలో డీవీఎం పీ కృష్ణచైతన్య, బెరంపార్క్, భవానీ ఐలాండ్, బోటింగ్ మేనేజర్లు కె.శ్రీనివాస్, డీ సుధీర్, నాగరాజు, అసిస్టెంట్ మేనేజర్ కొల్లి శ్రీధర్, ఏఈ కరీం, మన్నం కొండయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా లక్ష్మీ కల్యాణం



రాజ్యలక్ష్మీ, నరసింహుని కల్యాణం



వేణుగోపాలస్వామి మూలమూర్తులకు విశేష అలంకారం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని శ్రీ కోదండరామాలయంలో లక్ష్మీకల్యాణం శుక్రవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. లక్ష్మీ జయంతిని పురస్కరించుకుని ఆలయంలో పలు ప్రత్యేక కార్యక్రమాలను శుక్రవారం నిర్వహించారు. ఉదయం ఆలయంలోని రాజ్యలక్ష్మీ, నరసింహస్వామి ఉత్సవ మూర్తులకు ప్రత్యేక తిరుమంజన అభిషేకాలను నిర్వహించారు. పలు సుగంధద్రవ్యాలతో పాటుగా పంచామృతాలతో అభిషేకాలను నిర్వహించి విశేష అలంకారం చేశారు. మధ్యాహ్నం రాజ్యలక్ష్మీ, నరసింహస్వామి వార్ల శాంతి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఉభయదాతలు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. అర్చకస్వాములు రాఘవాచార్యులు, ఆంజనేయాచార్యులు, మురళీకృష్ణమాచార్యులు కార్యక్రమాలను నిర్వహించారు.

వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాలు ప్రారంభం

కొత్తపేటలోని శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో స్వామి కల్యాణోత్సవ వేడుకలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఉత్సవ మూర్తులకు ప్రత్యేక అలంకారం చేసి స్వామిని పెండ్లికుమారుడిగా, అమ్మవారిని పెండ్లికుమార్తెగా అలంకరించారు. శుక్రవారం అర్ధరాత్రి స్వామి కల్యాణోత్సవం, శనివారం స్వామి వారి నగరోత్సవాలను నిర్వహిస్తామని ఆలయ అర్చకస్వాములు తెలిపారు.

నేత్రపర్వంగా పద్మావతి కల్యాణం



పద్మావతి కల్యాణం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్‌లోని శ్రీ వెంకటేశ్వరస్వామి సన్నిధిలో పద్మావతి సమేత శ్రీనివాసుని కల్యాణోత్సవం శుక్రవారం నేత్రపర్వంగా నిర్వహించారు. దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో మహాలక్ష్మీ జన్మనక్షత్రమైన ఉత్తరఫల్గుణి నక్షత్రాన్ని పురస్కరించుకుని శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో శాంతి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. శాశ్వత ఉభయదాతల ఆధ్వర్యంలో కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. వివిధ ఘట్టాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు పీ రామచంద్రమూర్తి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు.

కన్నులపండువగా గరుడోత్సవం

పౌర్ణమిని పురస్కరించుకుని స్వామి వారి గరుడోత్సవాన్ని శుక్రవారం రాత్రి నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి వారి ఉత్సవ మూర్తులను గరడ వాహనంపై అధిష్టింపజేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి వారిని ఆలయంలో మూడు సార్లు ప్రదక్షిణగా ఊరేగించారు.

‘ప్రయాణం’ గ్రంథావిష్కరణ



ప్రయాణం (యాత్రా సాహిత్యం) గ్రంథావిష్కరణలో పాల్గొన్న అతిథులు

విజయవాడ కల్చరల్: సాహిత్యం సమకాలీనమై ఉండాలని ఆచార్య చల్లపల్లి స్వరూపరాణి అన్నారు. జాషువా సాహిత్యవేదిక ఆధ్వర్యంలో డాక్టర్ నూకతోటి రవికుమార్, అజయ్ మేడేపల్లి, కాసుల రవికుమార్, మల్లవరపు ప్రభాకరరావు సంయుక్తంగా రచించిన ‘ప్రయాణం’ యాత్రా సాహిత్యం గ్రంథాన్ని బాలోత్సవ భవన్‌లో శుక్రవారం ఆమె ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ సాహిత్యంలో నేడు అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయన్నారు. రచయితలు నలుగురు తమ సాహిత్య జీవితానికి సంబంధించి వారు ఎదుర్కొంటున్న సంఘటనలు, సాహితీవేత్తలతోపాటు ఇతర ప్రాంతాలను దర్శించిన సందర్భాలకు అక్షర రూపమిచ్చినట్లు వివరించారు. యాత్రా సాహిత్యం ప్రధానంగా వారి సాహిత్యజీవనానికి సంబంధించిన అనేక విషయాలను వివరించినట్లు తెలిపారు. యువ కవి అనిల్ డ్యాని మాట్లాడుతూ రచయితల కృషిని అభినందించారు. తొలి ప్రతిని సాహితీవేత్త కె.శోభారాణి స్వీకరించారు. గ్రంథాన్ని కథా రచయిత డాక్టర్ జడ సుబ్బారావు సమీక్షించారు. వివిధ రంగాలకు చెందిన కేవీ కృష్ణయ్య, వి.వెంకటేశ్వరరావు, గద్దం సుబ్బారావు, శిఖా ఆకాష్ ప్రసంగించారు.

విజయలక్ష్మికి ఘనసత్కారం

విజయవాడ కల్చరల్: మహానటి సావిత్రి సంక్షేమ సంఘం వ్యవస్థాపకురాలు పరుచూరి విజయలక్ష్మి సామాజిక సేవలను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని విశ్రాంత ఐవోసీ అధికారి బీవీ వీరభద్రరావు అన్నారు. ఇటీవల విశిష్ట మహిళా పురస్కారాన్ని అందుకున్న విజయలక్ష్మికి సాంస్కృతిక కళా సంస్థల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని సంస్థ కార్యాలయంలో శుక్రవారం అభినందనసభ నిర్వహించారు. ఈసందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ విజయలక్ష్మి ఉభయ తెలుగు రాష్ట్రాల్లో 18 వందలకు పైగా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. సావిత్రి కళాపీఠం ద్వారా సేవలను అందిస్తున్నట్లు వివరించారు. వివిధ సంస్థల ప్రతినిధులు ప్రభల శ్రీనివాస్, కే డేవిడ్‌రాజు, పైడిపాటి వెంకన్న, మల్లీశ్వరి, ఝాన్సీ, చలపతి, చంద్రశేఖర్, సునీల్, ఆదాం ఘనంగా సత్కరించారు.

హోలీ.. రంగోలీ..









విజయవాడ హౌసింగ్‌బోర్డ్ కాలనీలో హోలి పండుగ సందర్భంగా యువత, చిన్నారులు శుక్రవారం సంబరాలు జరుపుకొన్నారు. ఒకరిపై ఒకరు రంగునీళ్లు చల్లుకుంటూ ఉత్సాహంగా నృత్యాలు చేశారు.
–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ